క్లుప్తంగా

ఘనంగా అమ్మవార్లకు బోనాలు


కొడవండ్లపల్లిలో కొలువుదీరిన పెద్దమ్మతల్లి

యల్లనూరు: కొడవండ్లపల్లి పెద్దమ్మ, చింతకాయమంద అంకాలమ్మ, పెద్దమ్మ, యల్లనూరు పెద్దమ్మ, చిలమకూరు యల్లమ్మ అమ్మవార్లకు బుధవారం భక్తులు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా ఉగాది తర్వాత ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఆయా ఆలయాల ఎదుట జంతువులను బలిచ్చారు. బంధుమిత్రులకు విందు భోజనం వడ్డించారు. విందు కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

నేడు వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం

శింగనమల: మండలంలోని పెరవలి, పెద్ద జలాలపురం, జూలకాల్వ, అలంకరాయునిపేట, కొరివిపల్లి గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ యోగేశ్వరి, మండల కన్వీనర్ బాలకృష్ణ తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

మహిళకు తీవ్రగాయాలు

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఉప్పర్లపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పెద్దపప్పూరు మండలం అమ్మళ్లదిన్నెకు చెందిన లాలెమ్మ భర్తతో కలిసి ఆటోలో ఉప్పర్లపల్లికి వెళ్లింది. తిరిగి ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా అందులో ఉన్న రేకు జారి కింద పడింది. ఆ రేకును తీసుకోవడానికి లాలెమ్మ కిందకు దిగింది. ఆ సమయంలో ద్విచక్ర వా హనం ఢీ కొంది. లాలెమ్మను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం రెఫర్ చేశారు.

ప్రభోదానంద ఆశ్రమంలో కాటసాని రామిరెడ్డి


ప్రభోదానంద సమాధిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

తాడిపత్రిటౌన్: చిన్నపోలమడలోని ప్రభోదానంద సమాధిని నంద్యాల జిల్లా బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , ఉమ్మడి కర్నూలు జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో విశేషాలను ఆశ్రమ భక్తులు వారికి వివరించారు. ఆశ్రమంలో వున్న శ్రీకృష్ణుని ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవుకు మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, కొలిమిగుండ్ల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, చిక్కేపల్లి ప్రసాద్, రామసుబ్బయ్య ఉన్నారు.

తాడిపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

తాడిపత్రిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి అభివృద్ధికి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తాడిపత్రి అధ్యక్షుడు మనోజ్ కాశీం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో రూ.200కే కుళాయి కనెక్షన్లు మంజూరు చేయించారన్నారు. కూరగాయల మార్కెట్ వద్ద అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి అంబేడ్కర్‌నగర్, హరిజనవాడలోని పేదలకు వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. రూ.24 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, రూ.20 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించారన్నారు. ఆర్డీఓ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయించారన్నారు. చిరువ్యాపారులకు సుంకం నుంచి మినహాయింపు కల్పించారని తెలిపారు.

కమనీయం.. కల్యాణం


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: కమలపాడు కొండపై వెలసిన లక్ష్మీ కొత్త వేంకటరమణ స్వామి కల్యాణోత్సవం బుధవారం కమనీయంగా జరిగింది. ఉదయం అర్చకులు హరికృష్ణ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి కల్యాణాన్ని తిలకించారు. పెన్నా సిమెంట్ కంపెనీ ఉచిత మెడికల్ క్యాంప్ సౌకర్యం, చలివేంద్రం, షామియానాలు ఏర్పాటు చేసింది. యాడికి రవ్వా వారి ఫ్యామిలీ ఆధ్వర్యంలో భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

సోలార్‌గ్రిడ్‌లో యువతకు ఉపాధి కల్పిస్తాం

• ఎమ్మెల్యే వైవీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న 5వ వార్డు యువకులు

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులో ఏర్పాటు కానున్న సోలార్‌గ్రిడ్ ప్రాజెక్టులో నియోజకవర్గానికి చెందిన సుమారు 3 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం శ్రీశంకరానంద డిగ్రీ కళాశాల అధ్యాపకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగ సమస్యను సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి ఇతర ప్రాంతానికి తరలివెళ్లాల్సిన సోలార్‌గ్రిడ్ ప్రాజెక్టును గుంతకల్లుకు మంజూరు చేయించానన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌డీఓ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ధర్మవరం రైల్వేగేట్ అండర్‌బ్రిడ్జి, నియోజకవర్గంలో రూ.25 కోట్లతో ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధితో పాటు చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. జగనన్న సహకారం, ప్రజల ఆశీర్వాదంతోనే వీటన్నింటినీ చేయగలిగానన్నారు. మరోసారి తనను, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణలను దీవించాలని కోరారు. తాము కోరిన వెంటనే స్పందించి నెలలోపే రోడ్డును వేయించిన ఎమ్మెల్యే వైవీఆర్‌కు కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్‌లు మాచర్ల శివ, మస్తాన్, కసాపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరాచకశక్తుల నుంచి గుంతకల్లును కాపాడుకుందాం

ప్రశాంతతకు మారుపేరైన గుంతకల్లులో గతంలో ఎన్నడూ కక్షలు, కార్పణ్యాలు లేవని, కానీ ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన వ్యక్తి నేరచరిత్ర, ఆయన సోదరుల అసాంఘిక కార్యకలాపాల గురించి టీడీపీ వాళ్లే కళ్లకు గట్టినట్లు ప్రదర్శించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎక్కడైనా చిన్న గొడవైనా జరిగిందా? కనీసం టీడీపీ కార్యకర్తలనైనా ఇబ్బంది పెట్టామా అని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిందని, ఈ ప్రాంతంలో అరాచకాలు సృష్టించి యువత భవిష్యత్తును నాశనం చేయడానికి వస్తున్న వారి నుంచి మన గుంతకల్లును కాపాడుకుందామనిఎమ్మెల్యే అధ్యాపకులను కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో పట్టణంలోని 5వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వసంత్ ఆధ్వర్యంలో ఆ వార్డుకు చెందిన సుమారు 80 మంది యువకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 5వ వార్డుకు చెందిన సురేంద్ర, ప్రసాద్, రమేష్, రామాంజినేయులు, సుధాకర్, తలారి రమేష్, మస్తానయ్య, క్రిష్ణ, హరి, శివ తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 1వ వార్డు నాయకుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో 20 మంది మైనార్టీ యువకులు పార్టీలో చేరారు.మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, రామ్మోహన్‌రాయల్, సప్లయర్స్ శివ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు


వై.వెంకటరామిరెడ్డి


జొన్నలగడ్డ పద్మావతి


వీరాంజనేయులు

గుంతకల్లుటౌన్: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసదీక్షలతో రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ, సేవ, సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని ఆయన పేర్కొన్నారు. అల్లా దయతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

శింగనమల: నియోజకవర్గంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా దేవుని ప్రార్థించారన్నారు. పండుగ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

టీడీపీ కూటమికి బుద్ధి చెబుదాం


మాట్లాడుతున్న ఉదయ్ కిరణ్

గుంతకల్లు రూరల్: బీసీలకు సముచిత స్థానం ఇవ్వకుండా వారిని బానిసలుగా చూస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఎన్నికల్లో బుద్ధి చెబుదామని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ బీసీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, షర్మిల, పురందేశ్వరి దుష్టచతుష్టయంలా మారరన్నారు. కూటమి పార్టీలన్నీ కలిసి గతంలో ఎన్నడూ లేని విధంగా చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేసేలా ప్రవర్తిస్తున్నారన్నారు. రూ.కోట్లు ముట్టచెబితే తప్ప ఎమ్మెల్యే టికెట్ ఇవ్వని చంద్రబాబు కష్టపడిన వారి నోట్ల మట్టి కొడుతున్నారన్నారు. బీసీలకు ఆత్మగౌరవం ఇవ్వకుండా అణగదొక్కుతున్న కూటమి పార్టీలకు బుద్ధి చెప్పేందుకు బీసీలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

వలంటీర్ల రాజీనామాలతో జేసీకి ఓటమి భయం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: వలంటీర్లు పెద్ద ఎత్తున రాజీనామాలు చేస్తుండటంతో జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరులకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలిపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వలంటీర్లపై అభిమానాన్ని వ్యక్తం చేయడంపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి స్పందించారు. గతంలో వలంటీర్లపై విరుచుకుపడ్డ జేసీ నేడు వారిపై కపట ప్రేమను ఒలకపోస్తున్నాడన్నారు. స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి గెలుపు కోసం పని చేస్తామని, ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని వలంటీర్లు పూనుకోవడం జేసీని కలవరపెడుతోందన్నారు. వలంటీర్లపై జేసీకి అంత ప్రేమ ఉంటే పింఛన్ పంపిణీ నుంచి వారిని తొలగించాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినపుడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. వలంటీర్లను ఉగ్రవాదులుగా, స్లీపర్ సెల్స్‌గా, కామాంధులుగా అభివర్ణించినపుడు ఎందుకు ఖండించలేదన్నారు. బూటపు మాటలను వలంటీర్లు నమ్మరన్న విషయం జేసీ గ్రహించాలన్నారు. వలంటీర్లలో 95 శాతం మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలని ఒకవైపు చెబుతూనే మరోవైపు వలంటీర్లను తొలగించమని వారితో పనులు చేయించుకుంటామని రెండు నాల్కల ధోరణితో జేసీ మాట్లాడుతున్నారన్నారు. తన వారిని కాకుండా కార్యకర్తలుగా ఉంటున్న వారిని కొనసాగించే మంచి మనసు జేసీకి లేదనే విషయం వలంటీర్లకు తెలుసునన్నారు. తాడిపత్రిలో పూర్తిస్థాయిలో వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేస్తామన్న తానే వద్దని చెబుతున్నానన్నారు. కానీ టీడీపీపై ఉన్న అక్కసు వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానంతో వారు రాజీనామాలు చేస్తున్నారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎంతమంది యువకులకు ఉద్యోగాలు ఇచ్చాడో ప్రజలందరికీ తెలుసన్నారు. అప్పట్లో ఉద్యోగాలు లేవని, ఉద్యోగాల కోసం ఇంటి వద్దకు ఎవరూ రావద్దని జేసీ ఇంటి అవరణలో బోర్డు పెట్టిన విషయం ఆయన మరచిపోయాడేమోనని ఎద్దేవా చేశారు. అధికారం ఉన్నప్పుడే యువకులను పట్టించుకోని జేసీ తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను ఆదుకుంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జేసీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగించిన వారి స్థానంలో తన వారిని నియమించుకోవడమో చేస్తాడే తప్ప ఉన్నవారికి న్యాయం చేయడన్నారు. వలంటీర్లను తాడిపత్రి మునిసిపాలిటీ అభివృద్ధి కోసం వినియోగిస్తానని చెబుతున్న జేసీ తీరు నవ్వు తెప్పిస్తోందన్నారు. తాడిపత్రి మునిసిపాలిటీపై ఆయన ప్రేమ ఉంటే రూ.లక్షల టెండర్లు వేసిన పనులకు ఎందుకు అమోదం తెలపలేదని ప్రశ్నించారు. తాడిపత్రి అభివృద్ధి గురించి జేసీ ఆలోచించడం ఏనాడో మానివేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

తాడిపత్రిరూరల్: పట్టణంలోని నందలపాడులో బుధవారం రాత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సమక్షంలో షాషవలితో పాటు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ నేతలు పేరం ప్రతాప్, దిలీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సపోటా చెట్లు దగ్ధం


సపోటా చెట్లను పరిశీలిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: వేములపాడులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సపోటా చెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రంగారెడ్డి నగరూరు గ్రామానికి పోయే రహదారిలో తన వ్యవసాయ తోటలో సపోటా చెట్లు సాగు చేశాడు. బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఎండుగడ్డిపై పడటంతో తోటకు మంటలు వ్యాపించాయి. ఘటనలో 22 ఏళ్ల వయస్సున్న దాదాపు 122 చెట్లు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.4 లక్షల దాకా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఘటనస్థలికి చేరుకుని చెట్లను పరిశీలించారు. అధైర్యపడొద్దు ఆదుకుంటామని రైతుకు భరోసా కల్పించారు. జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, సాంబశివుడు, కల్యాణ్, అమర్ నాథరెడ్డి, రమానందరెడ్డి, రసూల్ ఉన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ పార్వేట

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం గ్రామంలో బుధవారం కొల్లాపురమ్మ పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారి ఆలయంలో ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు మండ్ల నగేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు నగేష్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానంనిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణ, (బూసీ) గోవిందు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం


జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు గ్రామంలో బుధవారం చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి జ్యోతుల ఊరేగింపు ప్రారంభమైంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఉత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం


మాట్లాడుతున్న ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె: రాష్ట్రంలో ప్రజలందరి మద్దతు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే ఉందని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రజల కోసం గుర్తుంచుకునేలా ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. చంద్రబాబు పాలన, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన మధ్య తేడా గమనించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి కొంత మందికి మాత్రమే పథకాలు అందిస్తారన్నారు. శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని దుష్ప్రచారాలు చేసిన ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారన్నారు. నవరత్నాల పథకాలు వల్ల లబ్ధిపొందిన వారికి మళ్లీ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అనంతపురము మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు చీమల శ్రీనివాసులు, వీరయ్య, క్రిష్టప్ప, బ్రహ్మానందరెడ్డి, శ్రీరాములు, నాగరాజు, సింగర, ప్రసాద్, దేవా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించడానికి మేమంతా సిద్ధం


రాజీనామా చేసిన 10వ వార్డు వలంటీర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్


రాజీనామా చేసిన 23వ వార్డు వలంటీర్లతో మున్సిపల్ వీసీలు మైమూన్, నైరుతిరెడ్డి

• మూకుమ్మడిగా రాజీనామా చేసిన 38 మంది వలంటీర్లు

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని, గుంతకల్లు నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని గెలిపించుకోవడానికి తామంతా సిద్ధమని 10, 23వ వార్డులకు చెందిన వలంటీర్లు పేర్కొన్నారు. నిస్వార్థంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న తమను కించపరుస్తూ నానా నిందలు వేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైఖరిని నిరసిస్తూ 10వ వార్డుకు చెందిన 24 మంది, 23వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను ఆయా వార్డు అడ్మిన్ సెక్రెటరీలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసి జగనన్న అమలు చేసిన పథకాలు, త్వరలో ప్రకటించబోయే కొత్త మేనిఫేస్టోను ఇంటింటికీ తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. జగనన్న కోసం రాజీనామా చేసిన ప్రతి ఒక్క వలంటీర్‌ను ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మైమూన్, నైరుతిరెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ బి.విజయలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ ఎద్దుల శంకర్, శ్రీనివాసులు అభినందించారు.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్కోరర్‌గా వినయ్



తాడిపత్రి అర్బన్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్కోరర్‌గా తాడిపత్రికి చెందిన బండెల వినయ్ ఎంపికయ్యారు. గత నెల 17 నుంచి 21 వరకు విజయనగరంలో నిర్వహించిన స్టేట్ ప్యానల్ స్కోరింగ్ పోటీల్లో అనంతపురం క్రికెట్ అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. మంచి మార్కులు సాధించడంతో ఆంధ్ర కికెట్ అసోసియేషన్ స్కోరర్‌గా ఎంపిక చేసింది. వినయ్ గతంలో జెఎన్టీయూఏ తరఫున యూనివర్సిటీ మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహించాడు. స్కోరర్‌గా వినయ్ ఎంపిక కావడంతో ఏడీసీఏ కార్యదర్శి మధు, అనంతపురం ఆర్డీటీ క్రికెట్ కోచ్ యుగంధర్‌రెడ్డి, ఏసీ యుఎస్‌ఏ సెక్రటరీ అన్సర్ ఖాన్, ప్రెసిడెంట్ జోసఫ్, వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, ఏటీఎల్ రామాంజనేయులు ఆర్డీటీ కోచ్ భార్గవ్ అభినందించారు.

జూదరుల అరెస్ట్

యాడికి: లక్ష్మంపల్లిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.6,130 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోదినాబాద్‌లో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న బి.లక్ష్మీనారాయణ అలియాస్ సుధాను బుధవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి ఆంధ్రా మద్యం(180 ఎంఎల్) 96 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

శింగనమల: ఈస్ట్ నరసాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పుల్లయ్య అనే వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

13న ఉద్యోగ మేళా

గుంతకల్లుటౌన్: స్థానిక శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి.ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ, యాక్సిస్, యూనిటీ స్మాల్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8639625572, 9441387552 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బుక్కరాయసముద్రం: ఉగాది పండుగ పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం ఉట్ల పరుష ఉత్సాహంగా సాగింది. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఉట్ల మానును ఎక్కడానికి యువకులు పోటీపడ్డారు. ఉట్ల పరుషను తిలకించడానికి పెద్ద సంఖ్యలో జనాలు తరలివచ్చారు.